ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
గురువారం 17 జూలై 2025



వానమ్మా.. ఒక్కసారి రావమ్మా..



వర్షం లేక మొలకెత్తని పత్తి

- కార్తెలు కరిగిపోతున్నా రాలని చినుకులు..
- వేసవి ముగుస్తుండగానే మొదలైన వర్షాలు
- రెండు నెలలు కావస్తున్నా కురవని భారీ వర్షం
- వెలవెలబోతున్న ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు
- జోరందుకోని వరి నాట్లు.. వాడిపోతున్న పత్తి మొలకలు

జూలై 16 వరకు జిల్లాలో వర్షపాతం (మిల్లీమీటర్లలో)

మండలం	సాధారణం	కురిసింది
రుద్రంగి	263.9	119.9
చందుర్తి	277.1	167.7
వేములవాడ రూరల్	245.2	142.9
బోయినపల్లి	220.1	117.0
వేములవాడ	250.2	144.0
సిరిసిల్ల	246.3	141.7
కోనరావుపేట	213.5	172.0
వీర్నపల్లి	229.0	152.9
ఎల్లారెడ్డిపేట	224.0	169.9
గంభీరావుపేట	218.4	165.8
ముస్తాబాద్	196.3	163.3
తంగళ్లపల్లి	250.5	207.7
ఇల్లంతకుంట	188.2	199.9
సగటు వర్షపాతం	232.5	158.8

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

కార్తెలు కరిగిపోతున్నా చిరుజల్లులే తప్ప భారీ వర్షాల జాడలేదు. 'వానాస'సాగు ప్రారంభమై రెండునెలలు దగ్గర పడుతున్నా వర్షాలులేక సాగు పనులు జోరందుకోవడం లేదు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో వానకాలం సాగుపై వర్షాభావ పరిస్థితులు, కమ్ముకుంటున్న కరువుమేఘాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. జిల్లాలో ప్రధానంగా ఉన్న శ్రీ రాజరాజేశ్వర మిడ్‌మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ అనంతగిరి ప్రాజెక్ట్, ఎగువమానేరు ప్రాజెక్ట్‌లతో పాటు చెరువులు, కుంటల్లోకి నీరు చేరగా వెలవెల బోతున్నాయి. మిడ్‌మానేరు ప్రాజె క్టుల్లో డెడ్‌స్టోరే జీకి చేరుకుంటున్నాయి. మిడ్ మానేరు ప్రాజెక్టులో 27.55 టీఎంసీల సామర్థ్యం కాగా 6.833 టీఎంసీల నీటినిల్వ ఉంది. దీంతో పాటు 3.50 టీఎంసీల సామర్థ్యంగల అన్నపూర్ణ ప్రాజెక్టులో 1.22 టీఎంసీలు, ఎగువ మానేరు ప్రాజెక్టులో 2.0 టీఎంసీలకు 0.61 టీఎంసీలు నీటి నిలువలు ఉన్నాయి. రోళ్ల పగిలే రోహిణీకార్తెలోనే వర్షాలు ఆశలు రేకెత్తించి ఆ తర్వాత చిరుజల్లులతో దిగాలు పరుస్తోంది. జిల్లాలో వరినాట్ల జోరు లేక సగం వరకు కూడా నాట్లు పడలేదు. తొలి వర్షాలతో పత్తి విత్తనాలు వేసుకున్న రైతులు మొలకదశలో నీళ్లలేక వాడి పోతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది.

జిల్లాలో 32 శాతం లోటు వర్షపాతమే...

రాజన్న సిరిసిల్ల జిల్లాలో జూన్ మాసం నుంచి ఇప్పటివరకు 46రోజుల్లో 2032.5 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం 158.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో 32శాతం లోటు వర్షపాతం నమోదైంది. జిల్లాలోని బోయిన్‌పల్లి, చందుర్తి, వేములవాడరూరల్, వేములవాడ, సిరిసిల్ల, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట,...

మిగతా 8లో

జిల్లాలో ఇప్పటి వరకు ఖరీఫ్ సాగు (ఎకరాల్లో)

మండలం	మొత్తం	వరి	పత్తి
గంభీరావుపేట	7055	7000	50
ఇల్లంతకుంట	27420	14500	12000
ముస్తాబాద్	8904	8500	300
సిరిసిల్ల	1355	800	550
తంగళ్లపల్లి	2910	2000	850
వీర్నపల్లి	4300	4000	300
ఎల్లారెడ్డిపేట	9000	7500	1500
బోయినపల్లి	9980	3500	6400
చందుర్తి	12120	6000	6100
కోనరావుపేట	14200	11000	3200
రుద్రంగి	3994	210	2190
వేములవాడ	5118	680	4400
వేములవాడ రూరల్	10039	6000	4000
మొత్తం	116395	71690	41850

నేటి నుంచి రుణాల వడ్డీ పంపిణీ

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు గురువారం నుంచి ఇందిరా మహిళా శక్తి కింద ఎస్‌హెచ్‌జీ రుణాలను పంపిణీ చేసేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళలు ఆర్థికంగా బలపడేందుకు, స్వయంసమృద్ధి సాధించేందుకు జిల్లాలోని స్వయం సహాయక మహిళా సంఘాలు ఇందిరా మహిళాశక్తి కింద తీసుకున్న రుణాలకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి వడ్డీ చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించిన జిల్లాలోని 8552 మహిళా సంఘాలకు దాదాపు రూ.12కోట్ల వడ్డీ డబ్బులు పంపిణీ చేయనున్నారు. గురువారం నుంచి వేములవాడ నియోజకవర్గంలో 18న సిరిసిల్ల నియోజకవర్గంలో వడ్డీ డబ్బులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు. గురువారం వేములవాడ నియోజకవర్గంలోని వేములవాడ అర్బన్ మండలంతోని 365 సంఘాలకు రూ 46.84లక్షలు, వేములవాడ రూరల్ మండలంలోని 442 సంఘాలకు రూ58.81లక్షలు, చందుర్తి మండలంలోని 613 సంఘాలకు రూ 82.50 లక్షలు, రుద్రంగి మండలంలోని 325 సంఘాలకు రూ 41.61లక్షలు, కోనరావుపేట మండలంలోని 910 సంఘాలకు రూ 113.32లక్షలు, సిరిసిల్ల నియోజకవర్గంలోని తంగళ్లపల్లి మండలంలోని 926 సంఘాలకు రూ 124.4.లక్షలు, గంభీరావుపేట మండలంలోని 1004 సంఘాలకు రూ 141.34లక్షలు, ముస్తాబాద్ మండలంలోని 1018 సంఘాలకు రూ 138.68లక్షలు, వీర్నపల్లి మండలంలోని 280 సంఘాలకు రూ 34.76లక్షలు, ఎల్లారెడ్డిపేట మండలంలోని 1022 సంఘాలకు రూ 150. 85లక్షలు, మొత్తం 4250 సంఘాలకు రూ 5 కోట్ల 90లక్షలు, అలాగే చొప్పదండి నియోజకవర్గంలోని బోయిన్‌పల్లి మండలంలోని 696 సంఘాలకు రూ 98.90లక్షలు, మానకొండూర్ మండలంలోని ఇల్లంతకుంట మండలంలో 951 సంఘాలకు రూ 145.51లక్షల వడ్డీని అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

సిరిసిల్ల రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలో సెస్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఈనెల 18న ఏర్పాటు చేసినట్లు సెస్ ఎండి రామసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పద్మనాయక ఏసీ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు జరిగే ఈ సమస్యల పరిష్కార వేదికకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక-2 నిజామాబాద్ చైర్మన్ ఈ నారాయణ హాజరవుతున్నారని తెలిపారు. పట్టణంలోని విద్యుత్ వినియోగదారులు హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సెస్ ఎండి రామసుబ్బారెడ్డి కోరారు.

గ్రామాల్లో కేంద్ర బృందం సభ్యుల పర్యటన



అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

ఎల్లారెడ్డిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం సింగారం, నారాయణపూర్ గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కేంద్ర బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. ఇంటింటా తిరుగుతూ పలు అంశాలపై సర్వే నిర్వహించారు. మరుగుదొడ్లు, మురుగు నీటి కాల్వలు, ఇంకుడు గుంతలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రం, కంపోస్టు షెడ్డులను పరిశీలించారు. నిర్వహణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర బృందం సభ్యులు సురేశ్, అనూష, శిరీష, ఎంపీడీవో సత్తయ్య, ఈజీఎస్ ఏపీవో కొమురయ్య తదితరులు ఉన్నారు.

ధనవంతుల కోసం పద్మశాలి సంఘం ఎన్నికలు



మాట్లాడుతున్న పద్మశాలి సంఘం నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికలు ధనవంతుల కోసం పెట్టుకున్నవని సంఘం నాయకులు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పద్మశాలి సంఘంలో జరిగిన కుంభకోణాలు బయటకురాకుండా ఉండడం కోసమే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు నామినేషన్ దరఖాస్తు రుసుములు ఇష్టానుసారంగా పెంచారని ఆరోపించారు. పద్మశాలి సంఘం సిరిసిల్ల పట్టణ కార్యవర్గం ఎన్నికల నోటిఫికేషన్ విడదల చేసిందని, ఈనెల 27న జరగబోయే ఎన్నికలకు దరఖాస్తు రుసుములను వ్యతిరేకిస్తున్నామన్నారు. పేదల కోసం పెట్టిన ఎన్నికలుగా తాము భావించడం లేదన్నారు. నలుగురే కూర్చుండి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పేద పద్మశాలీలు ఎన్నికలలో పోటి చేయవద్దు ధనవంతులే పోటి చేయాలన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. సమావేశంలో అరుకాల రమేష్, తడుక భాను, గడ్డం కమలాకర్, శెట్టిపల్లి నరేందర్, వెంగల అంజనేయులు, కుసు మ శేఖర్, ఉరగుండ వేణు, వడ్లకొండ దశరథం పాల్గొన్నారు.

ప్రజాపాలనను చూసి ఓర్వలేకపోతున్న బీఆర్‌ఎస్

- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కో కన్వీనర్ చక్రధర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చక్రధర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో ప్రజాపాలనను చూసి బీఆర్‌ఎస్ పార్టీ విషం కక్కుతుందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కో కన్వీనర్ కనిమేని చక్రధర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో చక్రధర్‌రెడ్డి మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలోని అన్ని గ్రామాల ప్రజలు కాంగ్రెస్ పార్టీని బలపరిచాలని, మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయడానికి మార్గం సుగమం అవుతుందన్నారు. బీఆర్‌ఎస్ పది సంవత్సరాల నిరంకుశపాలన దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. 20 నెలల కాంగ్రెస్ ప్రజాపాలనపై బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అధికార దాహం, దుర్బుద్ధితో అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచుకొని పనికిరాని ప్రాజెక్టులను నిర్మించి ప్రజలపై పెనుభారం మోపిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ ఒక్కొక్కటిగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేస్తుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేయడం వల్లే ప్రతిపక్షంలో కూర్చుందని ఎద్దేవా చేశారు. తెలంగాణను ఆర్థికంగా కేసీఆర్ దివాలా తీయించడంవల్లే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇబ్బంది పడుతున్నాడన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎమ్మెల్సీ కవిత, తీన్మార్ మల్లన్న ధన్యవాదాలు చెప్పకుండా ఒకరిపై ఒకరు వ్యక్తిగత దాడులు, విమర్శలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, నాయకులు సత్తు శ్రీనివాస్‌రెడ్డి, ఈగల తిరుపతి, కే శ్రీనివాస్‌రెడ్డి పొన్నం లక్ష్మణ్‌గౌడ్, అన్నల్‌దాస్ భాను, వంగిరి దత్తు, సామల బాబు, మధుసూధన్‌రెడ్డి, దుర్గయ్య, కనకయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయుల సర్దుబాటు

- టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ ప్రసాద్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న బుర్ర కృష్ణ ప్రసాద్‌గౌడ్

సిరిసిల్ల రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయుల సర్దుబాటులో అవకతవకలు జరిగాయని, వాటిని విద్యాశాఖ అధికారులు సవరించాలని టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణ ప్రసాద్‌గౌడ్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాటాడారు. ఇటీవల విడుదలచేసిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ జాబితా ఏమాత్రం నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా నిర్వహించారన్నారు. దీనిని వెంటనే సవరించాలన్నారు. ఈ విద్యాసంవత్సరంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట తర్వాత పాఠశాలలో పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సి ఉన్నా కూడా ప్రస్తుత సంఖ్యను పరిగణనలోకి తీసుకోకుండా పూర్వ విద్యాసంవత్సరం విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారన్నారు. నిబంధనల ప్రకారం కాంప్లెక్స్ యూనిట్ మొదట ఆ తర్వాత మండల యూనిట్‌గా, జిల్లా యూనిట్‌గా తీసుకోవాల్సి ఉండగా, మండలానికి సంబంధించి ఉపాధ్యాయులను దూరం మండలానికి సర్దుబాటు చేశారన్నారు. అధికంగా ఉపాధ్యాయులు అవసరం ఉన్న పాఠశాలలకు కేటాయించాల్సి ఉండగా అవసరమున్న చోట కూడా ఉపాధ్యాయులను తరలించి అక్కడికి వేరే ఉపాధ్యాయులను ఇచ్చారన్నారు. అవసరాల మేరకు కాకుండా ఉపాధ్యాయులు అవసరాల మేరకే డిప్యూటేషన్‌లు చేసినట్లు కనబడుతుందని, జిల్లాలో కౌన్సెలింగ్ పద్ధతిన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి బోయన్నగారి నారాయణ, సిరిసిల్ల మండల అధ్యక్షుడు పోతుగంటి రమేష్, మహేశుని లక్ష్మీనారాయణ, బూట్ల శ్రీనివాస్, అసాని అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజన్న హుండీ ఆదాయం రూ.1.59 కోట్లు

- 279 గ్రాముల బంగారం, 14.70 కిలోల వెండి..

7

పదిర శివారులో చిరుతపులి పాదముద్రలు

- భయాందోళనలో ప్రజలు

6

పెట్రోల్ బంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు

- మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి - కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా



మారుపాకలో పెట్రోల్ బంక్ ప్రతిపాదనలను పరిశీలిస్తున్న కలెక్టర్



విద్యార్థులకు బోధిస్తున్న కలెక్టర్

వేములవాడ టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మెప్మా ఆధ్వర్యంలో పెట్రోల్‌బంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదేశించారు. వేములవాడ మండల పరిధిలోని మారుపాక గ్రామ శివారులో సర్వే నంబర్ 339లో ఉన్న ఎకరం ప్రభుత్వ భూమిని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థలం హద్దులు సిద్ధంచేయాలని, మెప్మా ఆధ్వర్యంలో మహిళ సంఘాల సభ్యులు పెట్రోల్‌బంక్ నిర్మాణ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి కింద మహిళ సంఘాల సభ్యులు ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వారి వెంట మున్సిపల్ కమిషనర్ అన్వేష్, డీటీసీపీఓ అన్సార్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా డెస్క్ బెంచీలు

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు త్వరలో గ్యాస్ కనెక్షన్‌లు అందుబాటులోకి రానున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా తెలిపారు. మండలంలోని మారుపాక గ్రామంలోని అంగన్‌వాడీ ప్రైమరీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శి, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. బడిబాట కార్యక్రమంలో ఏమి చేశారని ప్రశ్నించారు. ప్రైమరీ స్కూల్లోని తరగతి గదిలో విద్యార్థుల బెంచీలు సరైన క్రమంలో ఏర్పాటుచేసి వారికి వీలైనంత సువిశాల గదిని కేటాయించాలని, రంగులు వేయించాలని సూచించారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డెస్క్ బెంచీలు లేకపోవడం గమనించి వెంటనే ఇతర పాఠశాలల్లో అధికంగా ఉన్న వాటిని ఇక్కడికి తెప్పించే ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలకు సరైన ప్రహరీ ఉపాధిహామీ కింద నిర్మించాలని అధికారులను ఆదేశించారు. విద్యాలయంలోని 8,9,10 తరగతుల విద్యార్థులకు సైన్స్, సోషల్, మాథ్స్ పాఠాలు బోధించారు. విద్యార్థులను ప్రశ్నలడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు సరైన విధంగా విద్యాబోధన చేయాలసిందిగా ఉపాధ్యాయులకు ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లల బరువును చెక్ చేశారు. పాఠశాల పరిసరాలు మొత్తం కలియతిరిగి పరిశుభ్రం చేయించాలని తెలిపారు. అంగన్‌వాడీ భవనం వాటర్ లీకేజీ లేకుండా వెంటనే బాగు చేయించాలని ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని వంటగదిని ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు.

కాగా, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాల మేరకు మండలంలోని మారుపాక ప్రభుత్వ పాఠశాలలో డెస్క్‌బెంచీలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలను బుధవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేసిన కొద్దిపాటి గంటల్లోనే విద్యార్థులకు డెస్క్‌బెంచీలను తెప్పించారు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి సమస్య పరిష్కరించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

హామీల అమలుతోనే ప్రజల్లో ఆదరణ..

- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ - కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్‌లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) :ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తుండటం వల్లనే కాంగ్రెస్‌పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రంలో బుధవారం పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు, నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కష్టపడిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. అందరు ఐకమత్యంగా పనిచేయాలని, అంతర్గత వ్యవహారాలను బహిరంగ వేదికలపై మాట్లాడవద్దని, నేరుగా తన దృష్టికి తీసుకరావాలన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయన్నారు. కొంతమంది నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించడానికి చేసే ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పీసీసీ కోఆర్డినేటర్ పాశం రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, ప్యాక్స్ మాజీ చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు ప్రసాద్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి, నాయకులు ఆనందరెడ్డి, తీగల పుష్పలత, బెజ్జంకి శ్రీనివాస్, సత్యం, యాదవరెడ్డి, మల్లేశం, మాధవరెడ్డి, మామిడి రాజు, చిట్టి ప్రదీప్‌రెడ్డి,ముత్యం అమర్, విజయ్, ఉస్మాన్‌లతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ సర్పంచ్‌లు

మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వీరిలో తిప్పాపూర్ మాజీ సర్పంచ్‌లు దమ్మని లక్ష్మిలక్ష్మణ్, బొల్లవేని మంజురమేష్, గాలిపెల్లి గ్రామ మాజీ సర్పంచ్‌లు అరుకుటి విజయలక్ష్మిమల్లేశం, న్యాత లక్ష్మిపోచయ్య, జవారిపేట గ్రామ మాజీ సర్పంచ్ పల్లె శ్రీలతరాజశేఖర్, మాజీ ఉపసర్పంచ్‌లు కొడిముంజ తిరుపతి, కాలువ దామోదర్, నాయకులు పల్లె ప్రణయ్‌కుమార్, బెజ్జంకి రమేష్, పౌలు, బెజ్జంకి తిరుపతి, సిరవేణి మహేష్, యాదమల్లయ్య, ఏగుర్ల నర్సయ్య, బాలయ్య, దమ్మని రాజు, అభినవ్, అబ్బసాని మల్లయ్య, సాంబ మంజుల, బొల్లవేని నర్సయ్య తదితరులు ఉన్నారు. ఎమ్మెల్యే వీరిందరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రైలు నుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలు

ఓదెల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం రాత్రి భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలునుంచి ప్రమాదవశాత్తు పడి యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వైపు వెళ్తున్న భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు బోగీ డోర్ వద్ద కూర్చున్న మంచిర్యాలజిల్లా జైపూర్ మండలం కిష్టాపూర్‌గ్రామానికి చెందిన మాదాసు తరుణ్ (23) అనే వ్యక్తి ఓదెల రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ చివర ఆకస్మాత్తుగా రైలునుంచి కిందపడడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. దీంతో 108అంబులెన్స్ ద్వారా సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

కొడుకు మృతిపై బెంగతో తండ్రి బలవన్మరణం

ముత్తారం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన మారం రాజిరెడి (55) మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా బుధవారం మృతిచెందాడు. ఎస్సై గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజిరెడ్డి కొడుకు గత సంవత్సరం మృతిచెందాడు. కొడుకుమృతిని తట్టుకోలేక రాజిరెడ్డి తరచూ బాధపడుతుండేవాడు. ఈక్రమంలో మనస్తాపానికి గురై మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన భార్య పద్మ వెంటనే రాజి రెడ్డిని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. మృతుడు రాజిరెడ్డి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పశువులకు కరువైన బీమా



నష్టపోతున్న రైతులు

చొప్పదండి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మూగ జీవాలకు బీమా సౌకర్యం లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. విద్యుత్ ప్రమాదంలో, ఇతర అనేక సందర్భాల్లో పశువులు మృత్యువాత పడుతున్న సందర్భంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో పశువులకు రాష్ట్ర



ప్రభుత్వం బీమా కల్పించగా ప్రస్తుతం ఎలాంటి బీమా అందడం లేదు. పశు పోషకులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2019లో పశువులకు బీమా సౌకర్యం కల్పించింది. ప్రీమియం సొమ్ములో రాష్ట్ర ప్రభుత్వం 80శాతం, రైతులు 20శాతం తమ వాటాగా బీమా సంస్థలకు చెల్లించేవారు.

ప్రమాదవశాత్తు పశువులు చనిపోతే బీమా సంస్థల ద్వారా రైతులు ప్రతి పశువుకు 60వేల రూపాయల వరకు బీమా పరిహారం పొందేవారు. ఐదేళ్లుగా బీమా సౌకర్యం ఎత్తివేయడంతో రైతులు నష్టపోతున్నారు. కేవలం బ్యాంకురుణం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా కొనుగోలు చేసిన పశువులకు మాత్రమే బీమా చేస్తున్నారు. బ్యాంకర్ల ఒత్తిడితోనే బీమా సంస్థలు ముందుకు వచ్చి పశువులకు బీమా చేస్తున్నాయి. రైతులు వ్యక్తిగతంగా తమ ఆవులు, గేదెలు, ఎద్దులు, మేకలు, గొర్రెలకు బీమా చేయించుకునే అవకాశం ఉన్నప్పటికీ అవగాహన కరువైంది. బీమా సంస్థలు సైతం ముందుకు రాక పశుపోషకులు నష్ట పోవాల్సి వస్తోంది.

చొప్పదండి మండలంలో 7000 వరకు పశువులు ఉండగా, 45నుంచి 50 వేల వరకు గొర్రెలు, మేకలు ఉన్నాయి. వీటికి ఎలాంటి బీమా లేకపోవడంతో రైతులకు ధీమా లేకుండా పోయింది. పశువులు మృత్యువాత పడుతున్న సందర్భంలో రైతులకు ఎలాంటి పరిహారం అందడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పశువులకు బీమా సౌకర్యం కల్పించి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం ఉందని పశుపోషకులు కోరుతున్నారు.

పదిర శివారులో చిరుతపులి పాదముద్రలు

● ఆందోళనలో ప్రజలు

ఎల్లారెడ్డిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రెండురోజుల కిందట ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి శివారులో చిరుతపులి సంచారం మరవక ముందే పదిర సమీపంలో మానేరు వాగు పరిసర వ్యవసాయ పొలాల్లో పాదముద్రల ఆనవాళ్లను బుధవారం రైతులు గుర్తించారు. శ్రీనివాస్ రైతు పొలంలో చిరుత పాదముద్రలు కనిపించడం వల్ల రెండు రోజుల క్రితం రాగట్లపల్లి, పదిర గ్రామాల్లో సంచారించి ఉంటుందా..? లేక ఈ ప్రాంతంలోనే ఆవాసం ఏర్పాటు చేసుకుందా..? అనే భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు చేరుకుని పరిశీలించారు. అవి రెండు రోజుల కిందట సంచరించిన చిరుతపులి పాదముద్రలేనని నిర్ధారించారు. రైతులు, ప్రజలు చీకటి సమయంలో పొలాల వద్దకు వెళ్లవద్దని సూచించారు. పశువులను ఇంటి సమీపంలో కట్టేయాలని పేర్కొన్నారు. చిరుతపులి కోసం గాలింపు ముమ్మరం చేశామని అటవీశాఖ అధికారులు వివరించారు.

రైల్వే స్టేషన్‌ను సందర్శించిన ఏడీఎమ్

జమ్మికుంట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను బుధవారం అసిస్టెంట్ డివిజనల్ మేనేజర్(ఏడీఎమ్) గుప్తా సందర్శించారు. రైల్వేస్టేషన్ ఆవరణ, కొత్తపల్లివైపు మూడవలైన్‌పై ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి లేకపోవడం, తదితరఅంశాలను ఆయన గుర్తించారు. బీజేపీ జిల్లాఅధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఎక్స్‌ప్రెస్‌రైళ్ల హాల్టింగ్, రిజర్వేషన్ బుకింగ్‌కౌంటర్ పెంచుట, లిఫ్ట్‌ఏర్పాటు, మూడవలైన్‌పై ఎఫ్‌వోబీ నిర్మాణంచేపట్టే విషయమై ఆయనకు వినతిపత్రం అందజేశారు. బీజేపీనాయకులతో కలిసి ఏడీఎమ్ స్వయంగా సమస్యలను పరిశీలించారు. వాటిపై నివేదికరూపంలో ఉన్నతాధికారులకు అందజేసి, త్వరలోనే సమస్యలు పరిష్కస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎరబెల్లిసంపత్ రావు, కొలగాని రాజు, ఆకులరాజేందర్, జీడి మల్లేష్, సంపెల్లి సంపత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతోపాటు ఇంటిలో చిన్నపాటి గొడవ వల్ల మనస్థాపం చెందిన రైతు వరుస దేవనందం పురుగుల మందు తాగాడు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు, బంధువుల కథనం మేరకు.. రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో జరిగిన గొడవ, మోకాళ్ల నొప్పులు అధికమవడంతో మనస్థాపానికి గురైన దేవనందం మంగళవారం రాత్రి తనపొలం వద్ద పురుగుల మందు తాగాడు. చీకటి పడినా దేవనందం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూసేసరికి అపస్మారక స్థితిలో కనిపించాడు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారని బంధువులు, స్థానికులు, పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

గంజాయి రవాణా చేస్తున్న దంపతుల అరెస్టు



పోలీసుల అదుపులో దంపతులు

బోయినిపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గంజాయిని అక్రమంగా తరలిస్తున్న దంపతులను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు వేములవాడ రూరల్‌సీఐ శ్రీనివాస్ తెలిపారు. సుల్తానాబాద్‌కు చెందిన వేముల శ్రీనివాస్, వేముల విజయలక్ష్మి దంపతులు మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి యువతకు విక్రయిస్తూ జల్సాలు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. భార్యభర్తలిద్దరూ గంజాయి తీసుకొని కోరెం గ్రామానికి వస్తున్నారనే పక్కాసమాచారంతో ఎస్ఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో దంపతులను తనిఖీచేయగా, వారివద్ద 250 గ్రాముల గంజాయి పట్టుబడిందన్నారు. దీంతో దంపతులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ కోతలపై రోడ్డెక్కిన రైతులు

● అధికారుల హామీతో ఆందోళన విరమణ



రైతులను సముదాయిస్తున్న సెస్ ఏఈ

గంభీరావుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో రైతులు రోడ్డెక్కారు. కరెంటుకోతలపై మండిపడ్డారు. తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద బైఠాయించారు. దుక్కిమందు బస్తాలతో సిద్దిపేట-కామారెడ్డి ప్రధానరహదారిపై గంటల తరబడి రాస్తారోకో చేయడంతో వాహణాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అంతరాయంతో పంటల సాగు అగమ్యగోచరంగా తయారవుతోందని మండిపడ్డారు. పంటలకు ఇస్తామన్న 18గంటల కరంటు ఏమైందని ప్రశ్నించారు. లో వోల్టేజీ సమస్యతో మోటార్లు కాలిపోతున్నాయని వాపోయారు. వరినాట్ల సమయంలోనే కరెంటుకోతలు ఉంటే మున్ముందు పరిస్థితి ఏంటి అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆందోళనకు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపి, రాస్తారోకోలో పాల్గొన్నారు. రైతుల ఆందోళనలతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకొని రైతులను శాంతించే ప్రయత్నం చేశారు. అయితే సెస్ ఏఈ రావాలంటూ రైతులు పట్టుబట్టారు. సెస్ ఏఈ వచ్చి సమాధానం చెప్పేవరకు కదిలేది లేదంటూ బీష్మించుకు కూర్చున్నారు. దీంతో సెస్ ఏఈ ఆందోళన వద్దకు వచ్చి రైతులకు నచ్చచెప్పారు. సాధ్యమైనంత త్వరగా విద్యుత్‌సమస్య తీర్చాలని లేనిపక్షంలో సెస్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించి రైతులు ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధి ప్రసాద్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కమలాకర్‌రెడ్డి తదితరులు రైతులు ఉన్నారు.

ఎమ్మెస్సార్ సతీమణి మృతి

● ప్రముఖుల సంతాపం



మేనేని సుగుణ(ఫైల్)

కరీంనగర్ అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, మాజీ పీసీసీ అధ్యక్షుడు దివంగత ఎం సత్యనారాయణరావు(ఎమ్మెస్సార్) సతీమణి మేనేని సుగుణ(85) అనారోగ్యంతో బుధవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని నివాసంలో మరణించారు. 50 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో తనసతీమణి మేనేని సుగుణ పాత్ర ఎంతోఉందని, ఆవిడ సహకారంతోనే రాజకీయరంగంలో రాజకీయాల్లో రాణించాని ఎమ్మెస్సార్ పలు ఇంటర్వ్యూల్లో చెబుతుండేవారు. ఆమెఅంత్యక్రియలను హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో గురువారం మధ్యాహ్నం 12గంటలకు నిర్వహించనున్నట్లు ఆమె మను మడు, టీపీసీసీ రాష్ట్రఅధికారి ప్రతినిధి మేనేని రోహిత్‌రావు తెలిపారు.

ప్రముఖుల సంతాపం ..

ఎమ్మెస్సార్ సతీమణి సుగుణ మృతికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సంతాపం తెలిపారు. ఆమె ఆత్మకు శాంతిచేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

తప్పిపోయిన వృద్ధుడి అప్పగింత

కరీంనగర్ క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కిసాన్ నగర్‌కు చెందిన రుద్రారం లక్ష్మయ్య(70) బుధవారం ఉదయం 8:30 గంటలకు ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో అతని భార్య త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. మానసిక సమస్యలతో బాధపడుతున్న ఆయన గతంలో నుంచి మందులు వాడుతున్నారు. త్రీటౌన్ పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా వెతికి ఐదు గంటల్లోనే లక్ష్మయ్యను గుర్తించి కుటుంబానికి అప్పగించారు. పోలీస్ సిబ్బంది సాయినేత్ర, ప్రశాంత్‌ను సీఐ జాన్‌రెడ్డి అభినందించారు.

అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న బైక్

● లారీ ఢీకొని ఒకరి మృతి, మరొకరికి గాయాలు

పెద్దపల్లి రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్ ఢీకొనడంతో వ్యక్తి కిందపడిపోగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొని మృతిచెందిన ఘటన పెద్దపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మందమర్రికి చెందిన సింగరేణి ఉద్యోగి గాండ్ల సత్యం(53) తనకూతురు లావణ్యతో ద్విచక్ర వాహనంపై పెద్దపల్లికి వెళ్తున్నాడు. అప్పన్నపేట వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో వాహనం నడుపుతున్న సత్యం రహదారికి అవతలవైపు పడిపోవడంతో గోదావరిఖని వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతనివెంట వస్తున్న కూతురు లావణ్యకు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. సత్యం స్వగ్రామం ఓదెల కాగా ఉద్యోగరిత్యా మందమర్రిలో ఉంటున్నాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

ఓదెలలో వెంటాడుతున్న విషాదాలు

ఓదెల: హత్యలు, ప్రమాదాల పరంపరతో ఓదెలలో విషాదం నెలకొంది. బుధవారం అప్పన్నపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓదెలకు చెందిన గాండ్ల సత్యం అక్కడికక్కడే మృతి చెందాడు. అతని కూతురు లావణ్యకు గాయాలయ్యాయి. సతీష్ మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ బొగ్గుగనిపై విధులు నిర్వహిస్తున్నాడు. అలాగే 15ఏళ్ల క్రితం సతీష్ సోదరుడు గాండ్ల రాజేశం శబరిమలైకి వెళ్లిన సమయంలో పంబా నదిలో స్నానం కోసం దూకడంతో తీవ్ర ప్రమాదానికి గురయ్యాడు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆ ఘటన జరిగిన కొద్ది రోజులకు రాజేశం భార్య రాజేశ్వరి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఒకేకుటుంబంలో ముగ్గురు మృతి చెందడం విషాదాన్ని నింపింది. అలాగే పొట్టకూటి కోసం బెల్లంపల్లికి వెళ్లి పదిరోజుల క్రితం లారీ ఢీకొనడంతో ఇదేగ్రామానికి చెందిన ఐలు మల్లేష్ మృతిచెందాడు. తాజాగా సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లిలో ఓదెలకు చెందిన మోటం మల్లేశం హత్యకు గురయ్యాడు. దీంతో బుడగజంగాల కాలనీలో భయాందో ళనలు నెలకొన్నాయి.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తికి జైలు

జగిత్యాల క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి అజాగ్రత్తగా వాహనం నడిపి ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి 10 సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.11 వేల జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి నారాయణ బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం నిర్మల్ జిల్లా రాంపూర్ గ్రామానికి చెందిన కూనారం సునీల్ 2022 జూన్ 13న పల్లికొండ రోహిత్, ప్రవీణ్ అనే ఇద్దరు స్నేహితులతో కలిసి ధర్మపురి మండలం దోనూరు గ్రామానికి వచ్చారు. పని ముగిం చుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో రోహిత్ అతిగా మద్యం సేవించి వాహనం నడపడంతో దోనూర్ గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి కింద పడిపోయింది. బైక్ మధ్యలో కూర్చున్న సునీల్ అనే వ్యక్తి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి పోచన్న ఫిర్యాదు మేరకు అప్పటి ధర్మపురి ఎస్సై కిరణ్ కుమార్ కేసు నమోదు చేశారు. సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టుడ్యూటీ అధికారులు శ్రీధర్, రాజు, కిరణ్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లేశం కేసు వాదించారు. నేరం రుజువుకావడంతో ముద్దాయి రోహిత్‌కు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ముద్దాయి రోహిత్‌కు డ్రైవింగ్ లైసెన్స్ లేక పోవడంతో లైసెన్స్ లేని వ్యక్తికి బైక్ ఇచ్చిన వాహన యజమాని పల్లికొండ మల్లేశంకు రూ.2 వేల జరిమానా విధించారు.

సీసీ కెమెరాల దొంగలను పట్టుకున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ లక్ష్మీనారాయణ

ఇల్లందకుంట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జరిగిన సీసీ కెమెరాల దొంగతనాన్ని 48గంటల్లోనే పోలీసులు చేధించారు. జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల14న ఇల్లందకుంట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మూడు కరెంటు ఫీజులు, మూడు సీసీకెమెరాలను దొంగలించారని పాఠశాల హెచ్‌ఎం ఫిర్యాదుచేశారు. ఫిర్యాదుమేరకు ఎస్ఐ క్రాంతికుమార్, ఏఎస్ఐ సదయ్య, కానిస్టేబుళ్లు రాజబాబు, అశోక్ దొంగతనాన్ని అన్నికోణాల్లో పరిశీలించారు. ఇల్లందకుంట గ్రామానికిచెందిన పదోతరగతి చదువుతున్న ముగ్గురుజువైనల్స్ ఈనెల11న రాత్రి ఈదొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. వారివద్దనుంచి మూడుఫీజులు, మూడు సీసీకెమెరాలను స్వాధీనం చేసుకొని కోర్ట్ ముందు హాజరు పరిచామన్నారు. త్వరగా కేసును చేధించిన ఎస్ఐ క్రాంతి కుమార్, ఏఎస్ఐ సదయ్య, కానిస్టేబుళ్లు రాజాబాబు, అశోక్‌ను సీఐ లక్ష్మీనారాయణ అభినందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో లాండ్రీ షాపు దగ్ధం

రామడుగు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం లక్ష్మీపూర్ గ్రామంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కావడంతో లాండ్రీ షాపు దగ్ధమయింది. గ్రామానికి చెందిన పాలమాకుల అంజయ్య కొన్నేళ్లుగా లాండ్రీషాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం షాపు బంద్ చేసుకొని ఇంటికి వెళ్లగా అనూహ్యంగా విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో దాదాపు అందులో ఉన్న 100డ్రెస్సులతోపాటు టేలా దగ్ధమయింది. సుమారు రెండు లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అంజయ్య తెలిపారు. పేదవాడైన అంజయ్యను ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.



దగ్ధమైన లాండ్రీ షాపు, బట్టలు

గూడు చెదిరింది..

కోల్‌సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని త్రివేణి కాంప్లెక్స్ సమీపంలోని రహదారి పక్కనేఉన్న ఒకపెద్ద చింతచెట్టు ఉంది. ఈ చెట్టుపై వందలాది కొంగలు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. ఈ చెట్టు రహదారిని కమ్మేసినట్టు ఉండడంతో భారీవాహనాలు వచ్చినప్పుడు ఇబ్బం దులు ఎదురవుతున్నాయి. చెట్టుపై ఉన్న కొంగలు రెట్టలు వేస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడు తున్నారు. వర్షాలు కురిసినప్పుడు భరించలేని వాసన వస్తోంది. దీంతో స్థానికులు చెట్టును తొలగించాలని నగరపాలక సంస్థలో పలుసార్లు ఫిర్యాదు చేశారు. బుధవారం కార్పొరేషన్ సిబ్బంది చింత చెట్టును కొట్టివేశారు. దీంతో కొంగల గూళ్లు దెబ్బతిన్నాయి. చెట్టుపైఉన్న కొంగలు భయపడి ఎగిరిపోయాయి. సాయంత్రం చెట్ల మండలను కార్పొరేషన్ సిబ్బంది రోడ్డుపక్కన వేసి వెళ్లిపో యారు. అప్పటివరకు అటూఇటూ తిరిగిన కొంగలు కాస్త సద్దుమణగగానే అదే చెట్టు వద్దకు వచ్చాయి. తలదాచుకునేందుకు చోటులేక కొట్టేసిన చింతచెట్టు కొమ్మలపైనే బిక్కు బిక్కుమంటూ కూర్చున్నాయి. తమగూడు ఎక్కడుందంటూ వెతుక్కున్నాయి. కొంగలతో ఇబ్బందిపడుతున్నామని అనుకున్నవారే వాటిపరిస్థితిని చూసి బాధపడ్డారు.



తొలగించిన చింతచెట్టు కొమ్మలపై వాలిన కొంగలు

దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

కొడిమ్యాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీబస్సు డ్రైవర్‌పై దురుసుగా ప్రవర్తించిన మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన వంగరి రాజుపై బుధవారం రాత్రి కేసునమోదు చేసినట్లు ఎస్సై ఎస్ సందీప్ తెలిపారు.

ఎస్సై తెలిపిన వివరాల మేరకు కొడిమ్యాల నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న ఆర్టీసీబస్సును నాచుపల్లి గ్రామంలో వంగరి రాజు ఆపి డ్రైవర్‌మొగిలి రవిపై దాడి చేశాడన్నారు. బాధితుడు రవి ఫిర్యాదు మేరకు కేసుమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తపస్ జిల్లా ప్రధానకార్యదర్శి అన్నమనేని తిరుపతి రావు డిమాండ్ చేశారు. బుధవారం కొత్తపల్లి మంలంలోని వివిధ పాఠశాలల్లో తపస్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల జీపీఎఫ్ డబ్బులు వారిఖాతాల్లో జమచేసే తేదీ వరకు వడ్డీ చెల్లించాలన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు పెండింగ్ బిల్లులను చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, పీఆర్సీని అమలు చేయాలని, ఏరియర్స్ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సత్యం, కుమార్, కొత్తపల్లి మండల శాఖ అధ్యక్షుడు శాంతిరాజ్, ప్రధానకార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేస్తున్న తపస్ జిల్లా ప్రధానకార్యదర్శి అన్నమనేని తిరుపతిరావు

శిలలపై శిల్పాలు చెక్కినారు..!



మల్యాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రాజారం గ్రామ శివారులో గల ఎస్సారెస్పీ కెనాల్ పక్కన ఎర్రాకుల రామస్వామి గుట్టపై వెలిసిన శ్రీరాముడి ఆలయం వద్ద పెద్ద బండరాళ్లపై వందల ఏళ్ల క్రితమే దేవుళ్ల విగ్రహాలను చెక్కారు. అవి భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వేల సంవత్సరాల క్రితం మునులు తపస్సు చేసుకోవడానికి ఈ గుట్టను ఎంచుకొని దేవుడిని కొలవడం కోసం వారు తపస్సు చేస్తున్న ప్రాంతంలో హనుమాన్, మహావిష్ణువు తదితర ప్రతిమలు పెద్ద బండరాళ్లపై చెక్కినట్లు పూర్వీకులు చెబుతారు. వీటితో పాటు ఆళ్వారులు, గరుడి ప్రతిమలు ఉండడంతో ఇది పురాతన ఆలయానికి గుర్తుగా భావిస్తున్నారు. గుట్ట కింద, మధ్యలో పైన ఈ శిల్పాలు కనిపిస్తుంటాయి. వీటి వద్ద భక్తులు పూజలు నిర్వహిస్తుంటారు. అయితే ఈ క్షేత్రం నిరాదరణకు గురి కాగా కొన్నేళ్లుగా ఈ ఆలయం వద్ద ఏటా ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వీటితో పాటు గోదారంగనాయకుల కల్యాణం తదితర పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి శ్రీపెరంబూదూరు కిరణ్ తెలిపారు.





ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో అమ్మోనియా లీకేజీ

● ప్లాంట్ షట్‌డౌన్ ● తెలంగాణతో పాటు ఆరు రాష్ట్రాలకు యూరియా సరఫరాకు ఆటంకం

కోల్‌సిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగుండంలోని రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్‌ఎఫ్‌సీఎల్)లో బుధవారం సాయంత్రం అమ్మోనియా మెయిన్ ప్లాంట్‌లో అమ్మోనియా గ్యాస్ పైప్‌లైన్ లీకైంది. దీంతో ప్లాంట్‌లో ఉత్పత్తిని నిలిపివేశారు. అమ్మోనియా ప్లాంట్‌లోని ఎల్‌బో పైప్‌లైన్‌లో వెల్డింగ్ ఊడిపోయి ఈ లీకేజీ జరిగినట్టు తెలుస్తున్నది. ఫీల్డ్ తనిఖీ చేస్తున్న ఉద్యోగులు పరిస్థితిని గమనించి వెంటనే సమాచారం ఇవ్వడంతో ప్లాంట్‌ను షట్‌డౌన్ చేశారు. తిరిగి ఉత్పత్తి దశలోకి ప్రవేశపెట్టాలంటే 15రోజులు సమయం పట్టనున్నది.



రోజుకు 3,850టన్నుల ఉత్పత్తి సామర్థ్యం గల ఈ పరిశ్రమ నుంచి తెలంగాణ తో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, కర్ణాటక రాష్ట్రాలకు యూరియా సరఫరా జరుగుతుంది. పరిశ్రమ షట్‌డౌన్ కావడంతో యూరియా సరఫరా నిలిచిపోయింది. తెలంగాణలో యూరియా కొరత ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిచిపోవడంతో సర ఫరాకు ఆటంకం కలుగనున్నది. జూలైలో తెలంగాణకు 30వేల టన్నులు సరఫరా కావాల్సి ఉండా 16వ తేదీ నాటికి 14,800టన్నులు సరఫరా జరిగింది. గత ఏడాది జూలైలో 60వేల టన్నులు ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి తెలంగాణకు ఇవ్వగా, ఈసారి కోటాను 30 వేల టన్నులకే కుదించారు. ఖరీఫ్ సీజన్‌లో నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో యూరియా అవస రాల దృష్ట్యా యుద్ధ ప్రాతిపదికన సరఫరా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌ఎఫ్ సీఎల్ నుంచి యూరియా కోటా పెంచాలని కేంద్ర ప్రభుత్వం వద్ద ఒత్తిడి చేస్తూ వస్తుంది. 30వేలతో పాటు అదనంగా మరో 10వేల టన్నులు అయినా లభిస్తుందని ఆశించిన పరిస్థితుల్లో ప్లాంట్ షట్‌డౌన్ అయ్యింది. ప్లాంట్ తిరిగి ఉత్పత్తి దశలోకి రావాలంటే మరో 15రోజులు పట్టే అవకాశం ఉంది.

మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నాం..






● ఫేక్ కాల్స్ చేసి మోసం చేస్తున్న సైబర్ నేరగాళ్లు

● భయపెట్టి డబ్బులు లాగుతున్న అక్రమార్కులు

కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తికి పోలీస్ ఆఫీసర్ డీపీతో ఉన్న నంబర్ నుంచి వాట్సప్ కాల్ వచ్చింది. పోలీస్ ఆఫీసర్ ఫొటో చూసేసరికి అతడు భయపడుతూనే ఫోన్ లిఫ్ట్ చేశాడు. మీ పేరు మీద ఓ పార్సిల్ వచ్చిందని, అందులో డ్రగ్స్ ఉన్నాయని, మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నామని అవతలి వ్యక్తి భయపెట్టాడు. దీంతో భయపడిపోయిన ఆయన తనకేం తెలియదని చెప్పినా వినిపించుకోలేదు. చట్టపరమైన చర్యలు తీసుకోకుండా ఉండాలంటే పది లక్షలు తాము చెప్పిన ఖాతాలో వేయాలని చెప్పాడు. దీంతో ఆయన ఎలాగోలా కష్టపడి ఆ సొమ్మును అతడు చెప్పిన ఖాతాలో వేశాడు. రెండు రోజు తర్వాత తాను మోస పోయానేమోనని పోలీసులను ఆశ్రయించాడు. అప్పటికే ఆ డబ్బులు వేరే ఖాతాకు వెళ్లి పోయాయి.. ఇలాంటి సంఘటనలు ఇటీవల ఎక్కువగా జరుగుతున్నాయి.



కరీంనగర్ క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి):మీఖాతాలోకి విదేశీ డబ్బులు అక్రమంగా ట్రాన్స్‌ఫర్ అయ్యాయని, కొడుకు కిడ్నాప్ అయ్యాడని, మీ సిమ్ కార్డు పై ట్రాయ్ కేసు నమోదైందని, పిల్లలపై కేసులు నమోదయ్యాయని కాల్ చేసి డిజిటల్ అరెస్టు చేస్తున్నట్లు సైబర్ నేరగాళ్లు భయాందోళనలకు గురిచే స్తున్నారు. ఈ కేసుల్లో డిజిటల్ అరెస్టు చేస్తున్నామంటూ వాట్సప్‌కాల్ చేస్తున్న వ్యక్తి పోలీస్ యూనిఫాంలో కనపడుతుంటాడు. ఇవ్వన్ని సైబర్ నేరగాళ్ల డబ్బులు కొల్లగొట్టేందుకు పన్నిన కుట్రలు.

డిజిటల్ అరెస్టు అనేదే లేదు..

నిజంగానే నేరాలకు పాల్పడిన నేర ఘటనల్లో ప్రమేయం ఉన్న సందర్భాల్లో ఆ వ్యక్తులకు పోలీసులు నేరుగా ఇంటికి వచ్చి నోటీసులు జారీ చేస్తారు.. లేదా అరెస్టు చేస్తారు. పోలీసులు, సీబీఐ, ఏసీబీ, సీఐడీ అధికారులు డిజిటల్ అరెస్టులు చేయరు. డిజిటల్ అరెస్టు అనేది సైబర్ నేరగాళ్ల వారి అమాయకులను దోచుకోవడం కోసం పుట్టించిన కొత్త పదం. ప్రజలు ఏ నేరం చేయనప్పుడు ఎవరికి కూడా భయపడాల్సిన అవసరం లేదనేది మొదట గుర్తించాలి.

1930కు ఫిర్యాదు చేయాలి

సైబర్ నేరగాళ్లు ఇటువంటి డిజిటల్ అరెస్టు వంటి బెదిరింపుకాల్స్ చేసిన సమయంలో నేరుగా ప్రజలు 1930కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం, ఫిర్యాదు చేయాలి.

అయితే డిజిటల్ అరెస్టు పేరిట సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు చాలా మంది భయపడి డబ్బులు సమర్పించుకుంటున్నారు. విద్యావంతులే ఇటువంటి సైబర్ నేరగాళ్ల వలకు ఎక్కువగా చిక్కుకుంటున్నారు. కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్‌లో సైబర్ క్రైం పోలీసులు ప్రతి రోజు పోలీసు స్టేషన్ల పరిధిలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జూలై నెలలో 15వ తేదీ వరకు కమిషనరేట్ వ్యాప్తంగా సైబర్ నేరాలపై 65 అవగాహన సదస్సులు నిర్వహించారు.

అప్రమత్తంగా ఉండాలి..

సైబర్ నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా డిజిటల్ అరెస్ట్ అంటూ ఫోన్లు చేస్తే భయపడకుండా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. బెట్టింగ్ యాప్‌లను, సోషల్ మీడియా ద్వారా వచ్చే ఏపీకే లింకులను క్లిక్ చేయవద్దు. తమ వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు, సీవీవీ నంబర్లు ఎవరితోనూ షేర్ చేసుకోవద్దు.

ఎన్టీపీసీ సీఎండీ గుర్‌దీప్ సింగ్ పదవీకాలం పొడిగింపు

ఏడాది పెంచుతూ ఉత్తర్వులు



జ్యోతినగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్టీపీసీ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గుర్‌దీప్ సింగ్ పదవీ కాలాన్ని ఏడాది పొడిగించారు. ఈ మేరకు అపాయ్‌మెంట్స్ కమిటీ ఆఫ్ కేబినెట్(ఏసిసి) బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

ఈ నెల 31తో ప్రస్తుతం సీఎండీగా పనిచేస్తున్న గుర్‌దీప్ సింగ్ పదవీ కాలం ముగియాల్సి ఉంది. విద్యుత్ మంత్రిత్వ శాఖ సీఎండీ పదవీకాలాన్ని ఏడాది పాటు పొడిగించాలని ఇటీవల ఏసీసీకి ప్రతిపాదనలు పంపించింది. దీంతో ఎసీసీ గుర్‌దీప్ సింగ్ పదవీకాలం పొడి గింపు ప్రతిపాదనకు అంగీకరిస్తూ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ విజయ్ కుమార్ దారక్ ఉత్తర్వులు విడుదల చేశారు. 01-08-2025 31-07-2026 వరకు గుర్‌దీప్‌సింగ్ సీఎండీగా కొనసాగనున్నారు. ఈయన 2014లో నియమితులయ్యారు.

రాజన్న హుండీ ఆదాయం రూ. 1.59 కోట్లు

● 279 గ్రాముల బంగారం, 14.70 కిలోల వెండి

వేములవాడ కల్చరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి 9 రోజుల హుండీలను బుధవారం లెక్కించారు. రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో అత్యంత భద్రత మధ్య హుండీలను లెక్కించారు. రాజన్న ఆలయ 9 రోజుల హుండీలు లెక్కించగా కోటి 59 లక్షల 52 వేల 901 నగదు, 279 గ్రాముల బంగారం, 14 కిలోల 700 గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో వెల్లడించారు. హుండీల లెక్కింపును ఆలయ ఈవో రాధాబాయి పరిశీలించారు. ఈ లెక్కింపులో ఏసీ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ ఆలయ ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఆలయ ఉద్యోగులు శివరామకృష్ణ భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక లోడింగ్

లారీ డ్రైవర్ల నిరసన

ముత్తారం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ శివారులోని తాడిచెర్ల బ్లాక్ టూ ఇసుక క్వారీలో నయాదందా మొదలైంది. క్వారీ యజమానులు కంపెనీ బంధ్ల పేరుతో బండికి సుమారు రూ.6000 రూపాయలు తీసుకుని లైన్ లేకుండా డైరెక్టుగా లోడు చేసి పంపిస్తున్నట్లు తెలుస్తోంది. డీడీ‌తో న్యాయపరంగా వచ్చిన లారీలను లోడు చేయకుండా వారంరోజులుగా పడిగాపులు కాపిస్తున్నట్లు లారీ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా తిండి తిప్పలు లేకుండా ఉన్న డ్రైవర్లు క్వారీ యజమానుల నుంచి సరైన సమాధానం రాక లోడ్ చేయకపోవడంతో ఖమ్మం పల్లి ప్రధాన రహదారిపై ఖాళీ వంటసామానుతో గ్యాస్ స్టౌవ్‌తో డ్రైవర్లు బైఠాయించారు. అధికారులు క్వారీలపై నిఘా ఏర్పాటుచేసి సక్రమంగా నడిపించాలని వారు కోరుతున్నారు.

త్వరలో నామినేటెడ్, పార్టీ పదవుల భర్తీ

● తెలంగాణను దోచుకున్న కేసీఆర్‌ను పాతాళంలోకి తొక్కింది కాంగ్రెస్ కార్యకర్తలే ● ఎమ్మెల్సీ, కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అద్దంకి దయాకర్

కరీంనగర్ అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): త్వరలో నామినేటెడ్, పార్టీ పదవులను భర్తీ చేసి అందరికీ న్యాయం చేస్తామని ఎమ్మెల్సీ కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అద్దంకి దయాకర్ అన్నారు. కాంగ్రెస్ సంస్థాగత పునర్నిర్మాణ సన్నాహక సమావేశాన్ని ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన డీసీసీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ కార్యకర్తల కష్టార్జితంతోనే తమకు పదవులు వచ్చాయని, కార్యకర్తలకు న్యాయం చేస్తామన్నారు. త్వరలో ఏర్పాటు చేయబోయే జిల్లా కార్యవర్గంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఒక జిల్లా ఉపాధ్యక్షుడిని నియమించనున్నారు.

జిల్లా మొత్తంగా ఒక ట్రెజరర్ ఉండాలని, ఒక అధికార ప్రతినిధి, ప్రతి బ్లాక్ నుంచి ఒక ప్రధాన కార్యదర్శిని నియమించనున్నారు. ప్రతి మండలం నుంచి ఒక కార్యదర్శిని ఎంపిక చేయాలన్నారు. సమన్వయకర్తలు ఇచ్చిన జాబితాలు తన వద్ద ఉన్నాయన్నారు. నమ్మిన తెలంగాణను నిండాముంచిన కేసీఆర్‌ను కాంగ్రెస్ కార్యకర్తలు పాతాళంలోకి తొక్కారన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే, కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ నాయిని రాజేందర్‌రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ ఎమ్మెల్యేలు కటకం మృత్యుంజయం, ఆరేపల్లి మోహన్, కోడూరి సత్యనారాయణ గౌడ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు రుద్ర సంతోష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రహమతుహుస్సేన్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి, నాయకులు వైద్యుల అంజన్ కుమార్, వెలిచాల రాజేందర్‌రావు, వొడితల ప్రణవ్ బాబు, ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఎండి తాజ్, ముత్యం శంకర్, కొరివి అరుణ్ కుమార్, బానోతు శ్రావణ్‌నాయక్ పాల్గొన్నారు.

పార్టీని నమ్ముకున్నాం.. ప్రాధాన్యం ఇవ్వండి

పార్టీని నమ్ముకున్న తమకు ఇప్పటి వరకు ఎలాంటి పదవులు లేవని, సరైన న్యాయం జరగలేదని రాజన్న సిరిసిల్ల జిల్లా, కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ జెండా పట్టుకుని తిరుగుతూ, సమస్యలపై పోరాటం చేసిన దుకు కష్టం గా ఉన్న సమయంలోనూ కష్టపడి పని చేశామని, అయినా గుర్తింపు లేకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న అద్దంకి దయాకర్, పాల్గొన్న ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్, నాయకులు

బీజేపీకి బీసీలపై కమిట్‌మెంట్‌లేదు..

బీజేపీకి బీసీల పట్ల కమిట్ మెంట్‌లేదని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విమర్శించారు. ఆయన బుధవారం కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో విలేక రులతో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల బిల్లుపై కేంద్రం ఎందుకు స్పందించడం లేదన్నారు. రాజ్యాంగ సవరణ ద్వారా కూడా ఆర్డినెన్స్ తీసుకురావచ్చన్నారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో ఎదురులేదని, కేసీఆర్ కుటుంబంలో లుకలుకలు వచ్చాయని, కవిత, కేటీఆర్‌లు పార్టీలో ఉంటారో ఉండరో తెలియని పరిస్థితిలున్నాయన్నారు. మహిళా రిజర్వేషన్లపై పోరాటం చేస్తామని, దీనిపై చట్టసభల్లో చర్చ జరగాలన్నారు. కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి నిధులు తేవడంలేదు కాని లేనిపోని పంచాయితీలు పెడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌పార్టీ కృషితోనే కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణనను చేర్చిందన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం 30 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్సీ కవిత కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు అద్దంకి దయాకర్ స్పందిస్తూ కాంగ్రెస్‌పార్టీలో ఇప్పటికే నాయకులు, కార్యకర్తలు ఎక్కువగా ఉన్నారని అన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్‌మల్లన్న, ఎమ్మెల్సీ కవిత గొడవలో ఇద్దరిదీ తప్పే అన్నారు.

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, అర్హులైనవారికి రేషన్‌కార్డులు ఇస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు.

రాజన్న సేవలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

వేములవాడ కల్చరల్: వేములవాడ రాజరాజేశ్వర స్వామిని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సంప్రదాయ స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజ అనంతరం అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఈవో రాధాబాయి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాజన్న ఆలయ అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి శంకుస్థాపన చేశారని, అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయని, రాజన్న ఆలయ గోశాల నిర్వహణకోసం మెరుగైన కార్యాచరణతో నిధులు మంజూరయ్యాయని చెప్పారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు ఖరారు



● ఉమ్మడి జిల్లాలో 646 ఎంపీటీసీ స్థానాలు

● 60 జడ్పీటీసీ, 60 ఎంపీపీ స్థానాల ఖరారు

● జిల్లాకొక జడ్పీపీటీసీ, మండలానికొక ఎంపీపీ

● విలీనంతో తగ్గిన ఆరు ఎంపీటీసీ స్థానాలు

కరీంనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం జడ్పీటీసీ, ఎంపీ టీసీ స్థానాలను ఖరారు చేసింది. ఉమ్మడి జిల్లాలో 646 ఎంపీటీసీ స్థానాలు, 60 జడ్పీ టీసీ స్థానాలను గుర్తించారు. జిల్లాకు ఒక జిల్లా ప్రజా పరి షత్, మండలానికి మండల ప్రజా పరిషత్ ఉంటాయి. రాష్ట్రవ్యాప్తంగా 5, 773 ఎంపీటీసీ స్థానాలు, 566 జడ్పీటీసీ స్థానాలు, 566 ఎంపీపీ, 31 జడ్పీపీలు ఉంటాయని ప్రభుత్వం ప్రకటించింది. కరీంనగర్ జిల్లాలో 15 జడ్పీటీసీ స్థానాలు, 15 ఎంపీపీ స్థానాలు, 170 ఎంపీటీసీ స్థానాలను ప్రకటించారు. గతంలో 176 ఎంపీటీసీ స్థానాలు ఉండగా కరీంనగర్ కార్పొరేషన్‌లో కొన్ని గ్రామాలను విలీనం చేయడంతో ఆరు ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి.

- జగిత్యాల జిల్లాలో 20 జడ్పీటీసీ స్థానాలు, 20 ఎంపీపీ స్థానాలు, 216 ఎంపీటీసీ స్థానాలు ఖరారయ్యాయి.
- పెద్దపల్లి జిల్లాలో 13 జడ్పీటీసీ స్థానాలు, 13 ఎంపీపీ స్థానాలు, 137 ఎంపీటీసీ స్థానాలు ఖరారయ్యాయి.
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 జడ్పీటీసీ స్థానాలు, 12 ఎంపీపీ స్థానాలు, 123 ఎంపీటీ సీ స్థానాలను ఖరారు చేశారు. రిజర్వేషన్లను ప్రకటించాల్సి ఉన్నది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లువర్తింపజేసేందుకు వీలుగా ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. గవర్నర్ ఆమోదం పొందిన తర్వాతే రిజర్వేషన్లను ప్రకటించేదని సమాచారం.

వచ్చే నెలలో తిరుపతికి ప్రత్యేక రైళ్లు

కరీంనగర్ రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నాందేడ్ నుంచి కరీంనగర్ మీదుగా తిరుపతికి వెళ్లే ప్రత్యేక రైలు ఆగస్టులో అందుబాటులో ఉంటుందని కరీంనగర్ రైల్వే స్టేషన్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 2, 9, 16, 23, 30 తేదీల్లో (శనివారాలు) నాందేడ్ నుంచి సాయంత్రం 4.50కి బయల్దేరే ప్రత్యేక రైలు (07015) ఉమ్మడి జిల్లా పరిధిలోని లింగంపేట-జగిత్యాల స్టేషన్‌కు రాత్రి 8.38, కరీంనగర్‌కు 9.38, పెద్దపల్లికి 10.05, జమ్మికుంటకు 10.38, తిరుపతికి మరుసటి రోజు ఉదయం 11.30కు చేరుకుంటుంది. తిరుపతి నుంచి ఆగస్టు 3, 10, 17, 24, 31 తేదీల్లో (ఆదివారాలు) ప్రత్యేక రైలు (07016) రాత్రి 7.45కి బయలుదేరి జమ్మికుంటకు మరుసటి రోజు 7.13, పెద్దపల్లి 8.15, కరీంనగర్ 9.08, లింగంపేట-జగిత్యాలకు 9.58, నాందేడ్‌కు సాయంత్రం నాలుగు గంటలకు చేరుకుంటుంది. తిరుపతి వెళ్లే ప్రయాణికులు ఈ రైలు సేవలను వినియోగించుకోవాలని కరీంనగర్ రైల్వే స్టేషన్ మేనేజర్ కోరారు.

సర్పంచులను మోసం చేసిన బీఆర్‌ఎస్

● చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

● లక్ష్మీదేవిపల్లి మాజీ సర్పంచ్ విజయలక్ష్మి భర్తకు పరామర్శ

కరీంనగర్ అర్బన్/గంగాధర, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా సర్పంచులను మోసం చేసిందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. లక్ష్మీదేవిపల్లి మాజీ సర్పంచ్ తాళ్ల విజయలక్ష్మి భర్త రవి గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు రాక ఆత్మ హత్యకు యత్నించి కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తప్పిదాలతో గ్రామాల్లో చేసిన అభివృద్ధి పను లకు బిల్లులు రాక పలువురు సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆనాడు కేసీఆర్ చేసిన పాపాన్ని మసిపూసి మారేడు కాయ చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై రుద్దడానికి బీఆర్‌ఎస్ నాయకులు అబద్ధపు ప్రచారానికి తెరలేపారన్నారు. పెం డింగ్ బిల్లులు చెల్లించకుండా ఇబ్బంది పెట్టిన పాపం ఎవరిదో రాష్ట్రంలోని మాజీ సర్పంచులు, ప్రజలకు తెలుసన్నారు. మాజీ సర్పంచులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. చొప్పదండి నియోజకవర్గంలోని అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. విజయలక్ష్మి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులు చేసిన పనులు చేశారని, బిల్లులు చెల్లించకుండా ముఖ్య మంత్రి కేసీఆర్ సర్పంచులను కష్టాలపాలు చేశారని ఆరోపించారు. రవికి సొంత ఖర్చుతో మెరుగైన చికిత్సను అందజేస్తామని తెలిపారు. మాజీ సర్పంచులు ఆందోళన చెందవద్దని, పెండింగ్ బిల్లులను చెల్లించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్, గంగాధర మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిరుమల్‌రావు, కాంగ్రెస్ చొప్పదండి మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.



మాజీ సర్పంచ్ భర్త రవిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గడ్డి మందు నిషేధించాలి

జిల్లాలో వినియోగిస్తున్న హానికరమైన గడ్డి మందును నిషేధించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం కలెక్టర్ పమేలా సత్పతికి ఫోన్‌లో సూచించారు. చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

సినీనటి అనుపమ పరమేశ్వరన్ సందడి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ నటి అనుపమపరమేశ్వరన్

కరీంనగర్‌లో వాహిని షాపింగ్ మాల్ ప్రారంభం

కరీంనగర్ అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఉస్మాన్‌పురలో వాహిని షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో సినీనటి అనుపమ పరమేశ్వరన్ సందడి చేశారు. హైదరాబాద్ ఓం ప్రకాశ్ జాజు సారీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా షాపింగ్ మాల్ యజమాని వేముల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రారంభోత్సవానికి వచ్చిన వినియోగదారులు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లప్పుడూ మీ ఆదరాభిమానాలు ఇలాగే ఉండాలని కోరారు.



చీరలను పరిశీలిస్తున్న అనుపమ పరమేశ్వరన్

కార్యక్రమంలో వేణుగోపాల్ జాజు, కమల్ ప్రకాష్ జాజు, వేముల శ్రీనివాస్, విష్ణు, దేవరాజ్, నాగరాజ్, శ్రీకాంత్, మెండె అనిల్ కుమార్, గడ్డం ఆదిత్య, కొమురవెల్లి రవితేజ, గాజుల అరుణ్ కుమార్, ప్రశాంత్, దీకొండ రాజు తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు ఉండి ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్ టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నీళ్లు ఉండి ఇవ్వలేని అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వానిదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. బుధవారం కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సాగునీరు లేక రైతులు పడ్డ ఎంపిపోతుంటే ప్రభుత్వం మొద్దు నిద్ర పోతున్నదన్నారు. 90 వేల క్యూసెక్కుల నీళ్లు వృథాగా పోతున్నాయని, అందులో 4వ వంతు 22 వేల క్యూసెక్కుల నీళ్లు తీసుకుంటే సరిపోతుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కక్షపూరితంగా నీళ్లు ఇవ్వడం లేదన్నారు. సమ్మక్క‌లో కలుస్తున్న నీళ్లను తీసుకొచ్చి చెరువులు, కుం టలు నింపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ వర్గాలు ఎస్సారెస్పీ కెనాల్‌లో పిల్లలు క్రికెట్ ఆడుతున్నారన్నారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు ఎత్తిపోతల ద్వారా దిగువనున్న జలాలను ఎగువకు మళ్లించారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో నీరు ఇచ్చే అవకాశం ఉన్నా పంపులను ఆన్ చేయకుండా వృథాగా దిగువకు విడుదల చేస్తున్నారన్నారు.

ఎస్సారెస్పీ కాలువలో క్రికెట్ ఆడి వినూత్న నిరసన

భగత్‌నగర్: రైతు వ్యతిరేక కాంగ్రెస్ పాలన సాగుతోందంటూ చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కొత్తపల్లి ఎస్సారెస్పీ కాలువలో బుధవారం క్రికెట్ ఆడి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా



కరీంనగర్ కలెక్టర్ పమేలాసత్పతికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వింత ఆకారంలో బొప్పాయి



గొల్లపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీరాముల‌పల్లె గ్రామంలో లక్ష్మి అనే మహిళా రైతు తోటలో వింత ఆకారంలో బొప్పాయి పండు కాసింది. దీంతో మహిళా రైతు దాన్ని చెట్టు నుంచి కోసింది. అనంతరం తోటలోని బొప్పాయి పండ్లతో పాటు వింత ఆకారంలో ఉన్న బొప్పాయిని విక్రయించింది.

వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధే లక్ష్యం

ఎల్లారెడ్డిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి పరిచి అన్నదాతల ఆర్థిక పరిపుష్టి సాధించడమే లక్ష్యంగా సహకారం సంఘం ముందుకు సాగుతోందని ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట సింగిల్ విండో పరిధిలోని ఎల్లారెడ్డిపేట, రాచర్లబొప్పాపూర్, నారాయణపూర్, హరిదాస్‌నగర్ గ్రామాల్లోని ఏడుగురు రైతులకు మంజూరైన రూ.38 లక్షల రుణాల చెక్కులను స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి సహకార సంఘం కృషి చేస్తోందని అన్నారు. వ్యవసాయంతో అనుబంధ రంగాల్లో అన్నదాతలు రాణించేలా ప్రోత్సహిస్తూ దీర్ఘకాలిక రుణాలను అందిస్తున్నామని అన్నారు. గొర్రెలు, ఆవులు, గేదెలు, కోళ్లు, పట్టుపురుగుల పెంపకం, కర్షకమిత్ర తదితర రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కృష్ణారెడ్డి కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు నర్సయ్య, వెంకటనర్సింహారెడ్డి, సంఘం కార్యదర్శి కిషోర్‌కుమార్, రైతులు పర్శరాములు, ప్రభాకర్, వేణుగోపాల్, రాజయ్య, ఎల్లయ్య, ఆనందం, ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి ఎంపీడీవోగా బీరయ్య..

వీర్నపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల పరిషత్ అధికారిగా బీరయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ముస్తాబాద్‌లో ఎంపీడీవోగా పని చేసిన ఆయనను వీర్నపల్లికి ఉన్నతాధికారులు బదిలీ చేశారు. మండలంలో పరిసరాల పరిశుభ్రత, శానిటేషన్ పనులపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. గామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. నూతనంగా భాధ్యతలు చేపట్టిన బీరయ్యను, బదిలీపై వెళ్తున్న వాజీద్‌ను మండల పరిషత్ సిబ్బంది, గర్జనపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు రాకేష్‌గౌడ్, వివిధ పార్టీల నాయకులు శాలువాతో సన్మానించారు.

పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

-టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు



రంగంపేటలో సభ్యత్వ నమోదు చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ సభ్యులు

వీర్నపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ ఉపాధ్యాయుల పీఆర్సీని వెంటనే అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రెండు సంవత్సరాల పాలన గడిచిన పీఆర్సీని ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ విరమణ చేసిన వారి బెన్‌ఫిట్స్‌ను విడుదల చేయాలన్నారు. ఉద్యోగులకు సంబంధించిన హామీలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి అంబటి రమేష్, జిల్లా కార్యదర్శి తిరుపతి జాదవ్, మండల అధ్యక్షుడు చేకూటి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి శేఖర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పగలు కూడా వెలుగుతున్న వీధిలైట్లు



ఎన్గల్‌లో పట్టపగలే వెలుగుతున్న వీధిలైట్లు

చందుర్తి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం ఎన్గల్ గ్రామంలో పట్టపగలు కూడా వీధి లైట్లు వెలుగుతున్న పట్టించుకునే వారే కరువయ్యారు. మండలంలోని ఎనగల్ గ్రామాలలో 24 గంటలు వీధిలైట్లు వెలుగుతున్న అటువైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పంచాయతీలకు కూడా నెలవారీగా విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయి. పగలు, రేయి అన్న తేడా లేకుండా వెలుగుతుండడంతో విద్యుత్ వృథాఅవుతుంది. ప్రభుత్వం విద్యుత్ వృధా చేయకుండా వాడుకోవాలని పేర్కొన్నప్పటికీ అధికారుల అలసత్వంతో వీధిలైట్లతో విద్యుత్ వృథా అవుతుందని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేకపోవడంతోనే అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రిన్సిపాల్‌గా బాధ్యతల స్వీకరణ



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న ఆధ్యాత్మిక బృందం సభ్యులు

చందుర్తి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా యం. విజయలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మెదక్ జిల్లా సదాశివపేట ప్రభుత్వ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వర్తించి పదోన్నతిపై చందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రిన్సిపాల్‌ను ఆధ్యాత్మిక బృందం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య, మౌలిక వసతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ

కోనరావుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండల కేంద్రంలోని పీఎంశ్రీ ఎంపీపీఎస్ బుధవారం మెహందీ, పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల పోతురాజు వేషధారణతో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మురళి నాయక్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆడెపు రాజేశం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మదన్‌లాల్ ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, భాస్కర్,రాము, వెంకటేష్, సంజీవ్, శృతి, అనూష, రాధా, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలకు వేలం

గంభీరావుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గాంధీ విగ్రహం వద్ద ఉన్న 6షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలకు ఈనెల17న గురువారం వేలంపాట నిర్వహిస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి వినీల్ తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు వేలంపాటలు ప్రారంభం అవుతాయన్నారు. వేలం పాటల్లో పాల్గొనే వారు రూ. 25వేలు డిపాజిట్ ముందే చెల్లించాలన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ కాలపరిమితి 1-08-25 నుంచి 31-03-26 వరకు ఉంటుందన్నారు. వేలంపాటల్లో పాల్గొనె వారు గ్రామపంచాయతీకి ఎలాంటి బకాయి ఉండకూడదన్నారు.

సమావేశాన్ని బహిష్కరించిన ఫీల్డ్ అసిస్టెంట్లు

గంభీరావుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల పరిషత్ ఆఫీస్‌లో బుధవారం నిర్వహించిన మండల స్థాయి సమావేశాన్ని ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు బహిష్కరించారు. మండల పరిషత్ ఆఫీస్‌లో పలు ఉపాధి హామీ తదితర అంశాలకు సంబంధించి ఎంపీడీవో రాజేందర్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. తమకు 3 మాసాలుగా వేతనాలు రావడం లేదని, దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని సమావేశంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు నిరసన తెలిపారు. పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేని పరిస్థితిలో తమ జీవితాలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ సమావేశాన్ని బహిష్కరించారు. అనంతరం ఎంపీడీవో రాజేందర్, ఏపీవో అరుణకు వినతి పత్రం అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు శంకర్, ఎల్లం, దేవయ్య, అనిల్, శ్రీనివాస్, రాజం, రవికుమార్ తదితరులు ఉన్నారు.

ఇసుక, మట్టి పక్కదారి పట్టిస్తే 'ఎస్మా' ప్రయోగిస్తాం..

- ట్రాక్టర్ ట్రిప్పు ఇసుక రూ.1500కే సరఫరా చేయాలి -వారానికి రెండు రోజులే అనుమతి : డీఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో

తంగళ్లపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇసుక, మట్టి పక్కదారి పట్టించినా.. ప్రభుత్వం నిర్ణయించిన ధరతో ఇసుక సరఫరా చేయాలనే నిబంధనలు ఉల్లంఘిస్తే ఎస్మా చట్టం ప్రయోగిస్తామని డీఆర్డీవో శేషాద్రి హెచ్చరించారు. బుధవారం తంగళ్లపల్లి మండలంలోని ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కార్యదర్శులు, ట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులతో ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక, మట్టి సరఫరా గురించి అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ గృహాలకు ఇసుక, మట్టి వారానికి రెండు రోజులు అనుమతి ఇస్తామన్నారు. ఇసుక బుధవారం, శుక్రవారాలు అనుమతిస్తామని మట్టి మంగళవారం, గురువారాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యహ్నం 1 గంట వరకే అనుమతి ఇస్తామన్నారు. సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా సిఫారసు లెటర్ తెస్తేనే అనుమతి ఉంటుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములు, గుట్టల నుంచి మట్టిని తీస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పట్టా భూములు, చెరువుల నుంచి అనుమతి తీసుకుని మట్టిని ఇందిరమ్మ ఇళ్లకు తరలించాలన్నారు. ఇందిర్మ ఇళ్లకు ట్రాక్టర్ ఇసుక రూ. 15వందలకే సరఫార చేయాలని లేకుంటే కఠిన చట్టాలు అమలు చేస్తామని హెచ్చరించారు. పది ట్రిప్పుల ఇసుక ఇందిరమ్మ ఇళ్లకు సరిపోవడం లేదని ఆదనంగా 5 ట్రిప్పుల ఇసుక ఇవ్వాలని ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అన్ని గ్రామాలకు రూ.15వందలకే ట్రాక్టర్ ఇసుకను సరఫరా చేయలేమని ట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. దృష్టి సారించాలని అధికారులను కోరారు. ఉన్నాతాధికారులు ఇసుక, మట్టి తరలింపులో సిరియాస్‌గా ఉన్నారని నిబంధనలు ఉల్లంఘించ వద్దని తహసీల్దార్ జయంత్‌కుమార్ సూచించారు. కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో ఇండ్లను పరిశీలించి మట్టి ఏ మేరకు అవసరం ఉంటుందో గుర్తించి ట్రాక్టర్ నంబర్, జేసీబీ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అనుమతివ్వాలని ఎంపీడీవో లక్ష్మీనారాయణ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీవో మీర్జా, హౌసింగ్ ఏఈ హమీద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, డైరెక్టర్లు పొన్నాల పర్శరాములు, ఆరెపల్లి బాలు, తిరుపతిరెడ్డి, ఇట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులు భాస్కర్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

పనులు, కూలీల మస్టర్ వివరాలు సక్రమంగా నమోదు చేయాలి

ఉపాధిహామీ పనులను, కూలీల మాస్టర్‌లను సక్రమంగా నమోదు చేయాలని డీఆర్డీవో శేషాద్రి ఆదేశించారు. బుధవారం తంగళ్లపల్లి మండల ఉపాధిహామీ కార్యాలయాన్ని డీఆర్డీవో సందర్శించారు. ఆన్‌లైన్ నమోదుతోపాటు హార్డ్ కాపీలలో నమోదు చేస్తున్న అంశాలను పరిశీలించారు. ఆన్‌లైన్ తలెత్తుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఏపీవో నాగరాజు, ఇన్‌చార్జీ ఏపీవో రాజనర్సులు ఉన్నారు.

అర్హులమైనా జాబితా నుంచి తొలగించారు..

- స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి - ఎంపీడీవోకు జిల్లెల్ల వాసుల వినతి



ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పిస్తున్న జిల్లెల్ల వాసులు

తంగళ్లపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్ రూం అర్హుల జాబితా నుంచి తమ పేర్లను తొలగించి అన్యాయం చేశారని తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన అర్హుల జాబితా నుంచి పేర్లు తొలగించిన వారు ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించారు. జిల్లెల్ల గ్రామంలో బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి అర్హులను గుర్తించి రెండు సంవత్సరాలుగా పంపిణీ చేయకుండా వదిలేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి సర్వే చేసి అర్హులైన జాబితాను తయారు చేసి మూడు రోజుల క్రితం ఇళ్ల మంజూరుపత్రాలను పంపిణీ చేసింది. గతంలో తయారుచేసిన జాబితా నుంచి తొలగించిన వారితో పాటు మరి కొంతమంది మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి డీఆర్డీవో, ఎంపీడీవోలకు వినతి పత్రం సమర్పించారు. అలాగే డబుల్ బెడ్‌రూం పక్కన ప్రభుత్వ స్థలం ఉందని ఆ స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మిగిలిపోయిన అర్హులు వ్యక్తిగతంగా దరఖాస్తులు చేసుకున్నారు. వారికి మద్దతుగా మాజీ సర్పంచ్ మాట్ల మధు, విజయేందర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లకు రోడ్డు కోసం సహకరిస్తామని, అలాగే అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

'ఫ్మార్మర్ రిజిస్ట్రీ'పై రైతుల అనాసక్తి

- మండలంలో నత్తనడకన సాగుతున్న వైనం



ఇల్లంతకుంట మండలంలో రైతుల వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో

ఇల్లంతకుంట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన రైతు నమోదు కార్యక్రమం నత్తనడకన కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు అందిస్తున్న పథకాలు సులభంగా అందించాలనే లక్ష్యంతో మూడు నెలల క్రితం ఫార్మర్ రిజిస్ట్రీ అనే కార్యక్రమాన్ని రూపొందించింది. తొలుత వ్యవసాయ విస్తీర్ణాధికారులు రైతువేదికలలో ఉండి రైతుల వివరాలు నమోదు చేశారు. మండలంలో 18వేల మంది రైతులు ఉండగా, ఇప్పటి వరకు సగం మంది రైతుల సమోదు సైతం పూర్తికాలేదు. కేంద్రప్రభుత్వం జారీచేసే ఫార్మర్ ఐడీ నంబర్ రావాలంటే రైతుల ఆధార్ నంబర్‌కు ఫోన్ నంబర్ అనుసంధానమై ఉండాలి. కొంతమంది రైతులవి ఇలా ఉండకపోవడం, మరికొంత మంది రైతులకు భూములకు రెండు గ్రామాలలో ఉండటం వల్ల ఇబ్బందులు తలెత్తాయి. రైతులు ఆధార్‌కార్డు తీసుకొని కేంద్రానికి వెళ్లడం ద్వారా అధికారులు నమోదు చేసినప్పుడు ఫోన్‌కు మూడుసార్లు ఓటీపీ వస్తుంది. కొన్ని ఫోన్లకు రాకపోవడంతో రైతునమోదు వేగవంతం కాలేదు. దీనితో అధికారులు గ్రామాలలోనే నమోదు చేయడం ప్రారంభించారు. అయినప్పటికీ రైతులు ఆసక్తి కనబర్చడం లేదు. కొంత మంది రైతులు పట్టణ ప్రాంతాలలో ఉండటం వల్ల ఎన్నిసార్లు సమాచారం ఇచ్చినా రావడం లేదని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- సురేష్‌రెడ్డి, వ్యవసాయాధికారి, ఇల్లంతకుంట



కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతునమోదును సద్వినియోగం చేసుకోవాలి. ఫార్మర్ ఐడీనే భవిష్యత్తులో ప్రామాణికంగా తీసుకొని పథకాలు అమలుచేసే అవకాశం ఉంది. ఇప్పటికే అన్ని గ్రామాలలో అవగాహన కల్పిస్తున్నాం. అయినా రైతులు పూర్తిస్థాయిలో రావడం లేదు. తొలుత సాంకేతిక కారణాల వల్ల ఆలస్యం అయినా ఇబ్బందులు తొలగిపోయాయి. ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకొని రైతుల వివరాలు ఆయా గ్రామాలలో పేర్కొంటాం. ఫార్మర్ రిజిస్ట్రీ చేయడానికి ఎక్కువ సమయం పట్టదు.

'కాంగ్రెస్‌ది ప్రజా దోపిడీ ప్రభుత్వం'



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌రావు

ఎల్లారెడ్డిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ సర్కార్ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ దోపిడీ ప్రభుత్వంగా మారిందని మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు ఆరోపించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని తాజా, మాజీ జడ్పీటీసీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ తమ బీఆర్ఎస్ హయంలో భవన నిర్మాణాలకు తక్కువ ధరకు ఇసుక సరఫరా జరిగిందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.4 వేలు చెల్లించాల్సిన దుస్థితి దాపురిస్తోందని అన్నారు. ఇసుక, మట్టి ధరలు రెట్టింపు అయ్యాయని, సామాన్యులు ఇళ్లు కట్టుకోలేకపోతున్నారని అన్నారు. ఇసుక, మట్టి తరలింపునకు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న నెలలు గడిచిన పట్టించుకునే వారే లేరని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిందీ పోయి కేటీఆర్, బీఆర్ఎస్‌పై అర్ధరహిత ఆరోపణలు లేయడం తగదని అన్నారు. ఇప్పటికైనా స్పందించి ఇసుక దోపిడిని అరికట్టి సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాలని లక్ష్మణ్‌రావు సూచించారు. సమావేశంలో నాయకులు సుభాష్, శ్రీనివాస్, నర్సాగౌడ్, మురళీమోహన్‌గౌడ్, సందీప్, తిరుపతినాయక్, నర్సింహారెడ్డి, బాలాగౌడ్, దేవరాజు, రాజం, రాజు, అజిమోద్దిన్, హసన్, సీత్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కెపాసిటర్ల బిగింపుతో నాణ్యమైన విద్యుత్

- ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సుదర్శనం

కథలాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ వ్యవసాయ పంపుసెట్లకు కెపాసిటర్లు బిగించుకుంటే నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అవకాశం ఏర్పడుతుందని ఎన్‌పీడీసీఎల్ జిల్లా సూపరింటెండెంట్ సుదర్శనం సూచించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన పొలం బాట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. ఇనుప స్టార్టర్లు తొలగించి ఫైబర్ స్టార్టర్ బాక్స్‌లు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కెపాసిటర్ల ఏర్పాటు వల్ల ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఎలాంటి అంతరాయాలు లేకుండా వ్యవసాయ, గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. వినియోగదారుల సహకారంతో మరింత విద్యుత్‌ను మెరుగుపరుచుకుంటాయని చెప్పారు. అనంతరం సిరికొండలో జరుగుతున్న సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎస్ఈగా నియమితులైన అనంతరం మొదటిసారి కథలాపూర్ రావడంతో అధికారులు, సిబ్బంది శాలువాతో సత్కరించారు.

ఈ సందర్భంగా టెక్నికల్ డీఈఈ మధుసూదన్, ఆపరేషన్ డీఈఈ రఘుపతి, ఏఈలు దివాకర్‌రావు, భూమేశ్వర్, సబ్ ఇంజనీర్ నవీన్, సిబ్బంది ఉన్నారు.

వానమ్మా.. ఒక్కసారి రావమ్మా..



నీరులేక వెలవెలబోతున్న మిడ్‌మానేరు ప్రాజెక్టు

(5వ పేజీ తరువాయి)

గంభీరావుపేట మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతంలో కోనరావుపేట, ముస్తాబాద్, తంగళ్ళపల్లి, ఇల్లంతకుంట మండలాలు ఉన్నాయి. గత సంవ త్సరం 728.5 సాధారణ వర్షపాతానికి 896.3 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

సాగని సాగు....

జిల్లాలో వానకాలం సాగు జోరుగా సాగడం లేదు. రెండు పాయింట్ 2.43 లక్షల ఎకరాల సాగు అంచనాలో ఇప్పటివరకు 1.16లక్ష ఎకరాల్లో మాత్ర మే వివిధపంటలు సాగు చేశారు. వర్షాభావ పరిస్థితులతో వరినాట్లు సగం కూడా పూర్తికాలేదు. పత్తి సాగు మాత్రం ముందస్తుగానే విత్తనాలు వేసుకోవడంతో చివరి దశకు చేరుకుంది. జిల్లాలో వానాకాలంలో 2లక్షల 43వేల 766ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయడానికి రైతులు సిద్ధమయ్యారు. వరి సాగు లక్షా 84వేల 860 ఎకరాలు, మొక్కజొన్న 1,600 ఎకరాలు, పత్తి 49,760 ఎకరాలు, కందులు 1,155 ఎకరాలు, పెసర 79 ఎకరాలు, ఇతర పంటలు 6,304 ఎకరాలు, ఇతర పంటలు 6,900 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేశారు. జిల్లాలో ఇప్పటివరకు వరి సాగు 71,690 ఎకరాలు, మొక్కజొన్న 2,403 ఎకరాలు, పత్తి 41,840 ఎకరాలు, కందులు 391 ఎకరాలు, పెసర 15 ఎకరాలు, ఇతర పంటలు 16 ఎకరాలు, ఇతర పంటలు 6,900 ఎకరాల్లో సాగు చేశారు.

డైరీల పంపిణీ

చందుర్తి జూలై 16 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం నర్సింగాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారతి ఫౌండేషన్ సహకారంతో 6వ తరగతి నుండి 10తరగతి చదువుతున్న విద్యార్థులకు డైరీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలరెడ్డి, గుండబోయిన శ్రీనివాస్, లక్ష్మణ్, పావని, మహేష్, బన్నాజీ, ఈగ శ్రీనివాస్, సాగర్, అశోక్, కార్తీక్ విద్యార్థులు పాల్గొన్నారు.

పనులు చేపట్టకపోతే అఖిలపక్షం ఆధ్వర్యంలో దీక్ష

బోయినిపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నిలిచిపోయిన గంజివాగు వంతెన నిర్మాణ పనులను ప్రారంభించకపోతే ఈనెల 21న మండలకేంద్రంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపడుతామని స్తంభంపల్లి మాజీ సర్పంచ్ జ్యోతికరుణాకర్ అన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోవడంతో పలుమార్లు కలెక్టర్, ఎమ్మెల్యే తీసుకెళ్లినా ప్రారంభంకావడంలేదన్నారు. ఇప్పటికైనా పనులు ప్రారంభించేలా అధికారులు కాంట్రాక్టర్‌ను ఆదేశించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత

బోయినిపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బోయినిపల్లి మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, కోరెం, తడకొండ ఆరోగ్య ఉపకేంద్రాలను జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు అందించే వ్యాక్సినేషన్ నిల్వలను పరిశీలించారు. 12 రకాల వ్యాధులకు నిరోధించడానికి పిల్లలకు టీకాలను తప్పనిసరి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ సంపత్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ, అనిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభ..



గ్రామసభలో పాల్గొన్న అధికారులు

రుద్రంగి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈజీఎస్ పనుల్లో జరిగిన అభివృద్ధి పనులపై ప్రత్యేకాధికారి నటరాజ్, ఏపీవో రాజయ్య బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన సోషల్ ఈడిట్ నిర్వహించామన్నారు. సోషల్ ఆడిట్‌లో పనులకు వచ్చిన నగదు చెల్లింపుల వివరాలను గ్రామసభలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తిరుపతి, ఏపీవో రాజేశ్వర్, టీఏ ధనుంజయ్, పంచాయతీ కార్యదర్శి రాందాస్, సోషల్ ఆడిట్ అధికారులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మహానంది అవార్డు గ్రహీతకు సన్మానం



మల్లేశంను సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

గంభీరావుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన యువ రైతు మహానంది అవార్డు గ్రహీత బొంగు మల్లేశంను యాదవ సంఘం మండల అధ్యక్షుడు దోమకొండ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బొంగు మల్లేశం సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించడంతో తెలుగు వెలుగు జాతీయ సాహితీ వేదిక మహానంది అవార్డుకు ఎంపిక చేసింది. ఇటీవల హైదరాబాద్‌లో ఈ అవార్డును మల్లేశం అందుకున్నారు. దీంతో మండల కేంద్రంలో మల్లేశంను యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో మండల యాదవ సంఘం అధ్యక్షుడు కృష్ణకాంత్‌యాదవ్, యాదవ సంఘం స్థానిక అధ్యక్షుడు లింగం యాదవ్, నాయకులు పెద్దవేని వెంకటి, దేవేందర్ తదితరులు ఉన్నారు.